

# అల్లరి
ALLARI

## చెప్పుకోండి

1. విఖ్యాత పెయింటింగ్ 'మోనాలిసా' రూపకర్త ఎవరు?
2. నవ బ్రహ్మ దేవాలయాలు ఎక్కడ ఉన్నాయి?
3. ఆఫ్ఘనిస్తాన్ జాతీయ జంతువు ఏది?



## పెద్దల మాట



రేపే చనిపోతున్నట్టు జీవించు! శాశ్వతంగా బతికి ఉంటానని భావించి జ్ఞానాన్ని సంపాదించు.

● మహాత్మా గాంధీ

## కథ

# ఐకమత్యం!



ఒక అడవిలో పలవల దుప్పి (పెద్ద కొమ్ములుండే దుప్పి) తన బుజ్జి కూనతో ఉండేది. కాలక్రమేణా కూనదుప్పి పెరిగి పెద్దదయ్యింది. దానికీ కొమ్ములు వచ్చాయి. 'నాకూ కొమ్ములున్నాయి కదా!' అని గర్వపడేది ఆ పిల్ల దుప్పి. ఒకరోజు తల్లి దుప్పి తన బిడ్డను పిలిచి.. ''ఈ అడవిలోని దుప్పులన్నిటికీ కొమ్ములు ఉన్నాయి. నీకు మాత్రం.. కొమ్ములతోపాటు గర్వం కూడా పెరిగింది. అందుకే, అందరితోనూ పోట్లాటకు దిగుతున్నావు. అలా మనలో మనం పోట్లాడుకుంటే.. వేరే జంతువులు మన బలహీనతను పట్టేసుకుంటాయి. మనకు ఇబ్బంది కలిగిస్తాయి. అదే.. మంచిగా, ఐకమత్యంతో ఉంటే అడవిలోని జంతువులన్నీ నీకు స్నేహితులు అవుతాయి!'' అంటూ మంచితనం, ఐకమత్యం గురించి వివరించింది. అంతా విన్న పిల్ల దుప్పి.. ''సరేనమ్మా! నువ్వు చెప్పిన విషయం అర్థం చేసుకున్నాను'' అని తల్లితో చెప్పింది. ఒక రోజు మేత కోసం బయటికి వెళ్లింది పిల్ల దుప్పి. ఎదురుగా మరో పొగరుబోతు పిల్ల దుప్పి.. గొడవకు దిగింది. పిల్ల దుప్పికి తన తల్లి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి.. ''మిత్రమా! మనలో మనకు పోట్లాట ఎందుకు? హాయిగా ఆకులు తిందాం! చక్కగా ఆడుకుందాం!'' అని చెప్పింది. కానీ, ఆ పొగరు

బోతు దుప్పి ఆ మాటలు వినలేదు. వేగంగా వచ్చి.. తన కొమ్ములతో పిల్ల దుప్పిని కుమ్మబోయింది. తనను తాను కాపాడుకునేందుకు పిల్ల దుప్పి కూడా తన కొమ్ములతో అడ్డుకుంది! ఆ పోట్లాటలో ఒకదాని కొమ్ముల్లో మరొకదాని కొమ్ములు ఇరుక్కుపోయాయి! అవి విడిపించుకునేందుకు అనేక విధాల ప్రయత్నించసాగాయి. వాటిని గమనించిన అడవి కుక్కలు.. తమకు ఆహారంగా రెండు దుప్పులు దొరికాయని సంబురపడ్డాయి. వేగంగా వాటివైపు రాసాగాయి. ఇదంతా చెట్టుమీద ఉన్న చింపాంజీ గమనిస్తూనే ఉంది. పెద్దగా అరుస్తూ వచ్చి.. వేటకుక్కలను తరిమేసింది. దుప్పుల దగ్గరికి వచ్చి.. వాటి కొమ్ములను వేరు చేసింది. ''పిల్ల దుప్పులూ! మీకు కొమ్ములు ఉన్నది.. శత్రువులనుంచి రక్షించుకోవడానికే. మీలో మీరు పోట్లాడుకోవడానికి కాదు. ఐకమత్యంగా ఉండకుండా.. ఇతర జంతువులకు ఆహారంగా మారుతున్నారు. ఇప్పటికైనా.. అందరూ కలిసిమెలిసి ఉండండి!'' అని హితబోధ చేసింది. చింపాంజీ మాటలను అర్థం చేసుకున్న రెండు పిల్ల దుప్పులూ.. కలిసి తమ తల్లుల దగ్గరికి వెళ్లాయి.

● కంచనపల్లి వెంకట కృష్ణారావు

## పదసృష్టి




కింది పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Bread

Ex : Read

## లిటిల్ హ్యాండ్స్





ప్రణీత్,
రాయిలాపూర్.

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

జవాబులు
జవాబులు : 1. లియోనార్డో డావిన్సీ, 2. ఆలంపూర్, 3. మంచు చిరుత

## కనిపెట్టండి



ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు చిత్రాల్లో 10 తేడాలున్నాయి. అవేంటో కనిపెట్టండి.

# రాములోరి ఇలాకా రమణీయం

- అభివృద్ధి పథంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
- జిల్లాగా ఏర్పడి నేటికీ ఏడేళ్ల పర్వం..
- మన్యం బిడ్డలకు దగ్గరైన ప్రభుత్వ పాలన
- జిల్లాల పునర్విభజనతో మరింత అభివృద్ధి
- సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమైందంటున్న విద్యావంతులు, రిటైర్డ్ అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ) : గత పాలకుల హయాంలో నిరాదరణకు గురైన ప్రాంతాలను గుర్తించిన సీఎం కేసీఆర్ అభివృద్ధి బాటలు పట్టించారు. అడగకున్నా వరాలు కురిపించారు. నాడు దూరాభారంగా ఉన్న పాత జిల్లాలను కొత్త జిల్లాలుగా చేసి కొత్త పాలనకు శ్రీకారం చుట్టారు. ఉమ్మడి ఖమ్మంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న భద్రాద్రి జిల్లాను కొత్త జిల్లాగా చేసి నేటికి ఏడేళ్లయ్యింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో ఎన్నో మార్పులు చకచకా జరిగిపోయాయి. మారుమూల ప్రాంతాల ప్రజలకు పాలన చేరువ కావడంతోపాటు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు దగ్గరయ్యాయి. అధికారులు గ్రామ స్థాయికి చేరుకొని ప్రజా సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నారు. అభివృద్ధి అంటే ఇలా ఉంటుందని సీఎం కేసీఆర్ చేసి చూపించారు.

### జిల్లా ఏర్పాటుతో మారిన రూపురేఖలు

తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లా.. జిల్లా కేంద్రం రూపురేఖలను మార్చివేసింది. రాజకీయ, వ్యాపార పరంగా అభివృద్ధి చెందడంతో కొత్తరూపును సంతరించుకున్నది. ప్రభుత్వ కార్యాలయాలతోపాటు కొత్త గా వచ్చిన ఉద్యోగులు, రెస్టారెంట్లు, హోల్‌సేల్ వ్యాపారాలు, కార్పొరేట్ వైద్యం, ప్రైవేటు విద్యాలయాలు నెలకొల్పడంతో వ్యాపార రంగం మరింత వేగంగా పెరిగిపోయింది. కిన్నెరసాని పర్యాటక ప్రాంతానికి పర్యాటకుల తాకిడి పెరిగింది. ఫారెస్టు అర్బన్ పార్క్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది.



రామవరంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

### కొత్తగా ఏర్పాటైన కార్యాలయాలు

నిర్మాణంలో ఉన్న కొత్త కలెక్టరేట్, మెడికల్ కాలేజీ, ఫారెస్టు అర్బన్ పార్క్, కిన్నెరసాని టూరిజం, బడ్జెట్ హోటల్, కృషి విజ్ఞాన కేంద్రం, జిల్లా ప్రధాన ఆస్పత్రి, నర్సింగ్ కాలేజీ, సఖి సెంటర్, జడ్పీ, జిల్లా ఎస్పీ కార్యాలయం, అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అందుబాటులోకి వచ్చాయి. సాగు, తాగునీరు సౌకర్యం మెరుగుపడేందుకు మిషన్ కాకతీయ చెరువులు, మిషన్ భగీరథ పథకం, జిల్లా మత్స్య శాఖ కార్యాలయం రావడంతో ఏటా మత్స్యకారులకు ఉచితంగా చేపపిల్లల పంపిణీ ఇక్కడి నుంచే జరుగుతోంది.



సీతారాంపురం పల్లె ప్రకృతి వనం

### కొత్తగా ఆరు మండలాలు

జిల్లా ఏర్పాటుతోపాటు కొత్తగా ఆరు మండలాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, సుజాతనగర్, గుండాల, ఆళ్లపల్లి, అన్నపురెడ్డిపల్లి మండలాలు ఏర్పాటయ్యాయి. దీంతో అక్కడ కొత్త కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చాయి.

### సరైన వాళ్ల చేతిలోకి పాలన



పరిపాలన సరైనోళ్ల చేతిలోకి వచ్చినప్పుడు అభివృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు పెడుతున్నాయి. నిజంగా పాలన అంటే ప్రతి ఒక్కరికీ అర్థమైంది. ఇది కదా పాలన అని తెలంగాణ సర్కారు రుజువు చేసింది. కొత్త జిల్లా ఏర్పాటు వల్ల ప్రజలకు సౌకర్యాలు మెరుగుపడ్డాయి. దూరాభారం తగ్గింది. సమస్యలను చెప్పుకోవడానికి అధికారులు దగ్గరగా వచ్చేశారు. ఇంతకంటే ఏం కావాలి.

– కే.రాజమల్లు, సింగరేణి విశ్రాంత ఉద్యోగి, కొత్తగూడెం

### ప్రజలకు మేలు జరిగింది



ఇప్పుడు పల్లెలు పట్నంతో పోటీ పడే స్థాయికి వచ్చేశాయి. ఇది అనుకోకుండా వచ్చిన మార్పు. అలాంటి మేధావి వర్గం పాలిస్తే దానంతట అదే అభివృద్ధి చెందుతుంది. అందుకే కొత్త మండలాలు, కొత్త పంచాయతీలు వచ్చాయి. అప్పుడు అధికారులు కూడా పరిపాలన చేయడానికి చాలా సులువవుతుంది. మంచి పోలీస్ వ్యవస్థ వచ్చింది. స్టేషన్ అంటే భయపడే రోజులు పోయాయి.

– గుడిపూడి మోహన్‌రావు, విద్యావంతుడు, టేకులపల్లి మండలం

### మన ఊరు-మనకే బడి



అప్పట్లో బడి చూడాలంటే ఎక్కడో ఒకటి అద్భుతంగా ఉండేది. ఇప్పుడు మన ఊరు–మన బడి అదే.. భద్రాద్రి జిల్లా సర్కారు బడులు. ఎంత అందంగా ఉన్నాయి. నాడు బ్లాక్ బోర్డులు లేని స్కూళ్లు నేడు డిజిటల్ బోర్డులతో కనిపిస్తున్నాయి. ఇంత అద్భుతమైన పాఠశాలలు వస్తాయని ఏనాడూ అనుకోలేదు. పిల్లలకు చక్కటి చదువులు అందుతున్నాయి.

– ఎస్కే.యాకూబ్, రిటైర్డ్ హెచ్‌ఎం, అంజనాపురం, బూర్గంపాడు మండలం



కొత్తగూడెం మెడికల్ కాలేజీ

### చాలా మార్పులొచ్చాయి



తెలంగాణ తెచ్చిన సీఎం కేసీఆర్ ఏది చేసినా ప్రజల కోసమే చేస్తారు. గిరిజన జిల్లా ప్రజలకు అందుబాటులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరం. పెద్దాస్పత్రి వచ్చింది.. ఆరోగ్య సమస్యలు తీరిపోయాయి. ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యాన్ని కల్పించారు. కొత్త మండలాలు ఏర్పాటు చేయడం వల్ల అక్కడి ప్రజలకు దూరాభారం తగ్గింది. ధరణి వల్ల భూ సమస్యలు పరిష్కారమయ్యాయి.

– కలకోట ఉప్పలయ్య, రిటైర్డ్ తహసీల్దార్, ఖమ్మం జిల్లా

### పాలన ప్రజలకు చేరువైంది



చిన్న జిల్లాల ఆలోచన చాలా గొప్పది. పాలన ప్రజలకు చేరువైంది. ఖర్చు కూడా తగ్గింది. ప్రజావాణిలో వినతులు సమర్పించేందుకు గతంలో ఖమ్మం వెళ్లేవారు. ఇప్పుడు కొత్తగూడెం వరకు రావాల్సి ఉంటుంది. అధికారులు అందరూ ఒకే దగ్గర కలిసే అవకాశం కలిగింది. ప్రజల సమస్యలు వెంటనే పరిష్కారం కావడానికి మరింత అవకాశం లభించినట్లైంది. దీంతోపాటు కొత్త మండలాలు, పంచాయతీలను కూడా ఏర్పాటు చేశారు.

– ఎంవీ.రెడ్డి, రిటైర్డ్ కలెక్టర్

### గురుకులాల్లో వసతి పెరిగింది



గురుకులాలు వచ్చాక సౌకర్యాలు బాగా పెరిగాయి. బాలికలు, బాలురుకు వేర్వేరు స్కూళ్ల నుంచి కాలేజీ వరకు బోధన, వసతి అక్కడే. ప్రభుత్వం కార్పొరేట్‌ను మించి సౌకర్యాలు కల్పిస్తున్నది. చూడముచ్చటగా పిల్లలకు డ్రెస్ కోడ్, ఆట వస్తువులు, స్టడీ అవర్స్, చక్కని విద్యాబోధన అందుతున్నది. సర్కారు స్కూళ్లకు విద్యార్థుల సంఖ్య పెరిగింది.

– పయ్యావుల రామమూర్తి, రిటైర్డ్ బీసీ వెల్ఫేర్ అధికారి

# ఆపదలో ఆదుకొనే అమ్మ ఒడి



**102 వాహనంతో తప్పిన గర్భిణుల బాధలు**

**ప్రభుత్వ ఆస్పత్రుల్లో పరీక్షల తర్వాత ఇళ్లకు తరలింపు**

**గర్భిణులకు న్యూట్రిషన్, బాలింతలకు కేసీఆర్ కిట్లు**

**సబ్ సెంటర్‌ల వారీగా విస్తృతంగా సేవలందిస్తున్న 102**

**పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌ను మరువలేమంటున్న లబ్ధిదారులు**

మధిర, అక్టోబర్ 10 : గతంలో గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు వైద్య పరీక్షల కోసం ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. బస్సులు, ఆటోలు, రిక్షాల్లో వెళ్లి అవస్థలకు గురయ్యేవారు. వీరి కష్టాలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం అమ్మ ఒడి పథకంలో భాగంగా 102 సేవలను అందుబాటులోకి తెచ్చింది. గర్భిణులు, బాలింతల కోసం సీఎం కేసీఆర్ 2017 జనవరిలో అమ్మ ఒడి పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా రూపొందించి అమలు చేస్తున్నారు. ఇంటి వద్ద ఉన్న గర్భిణులు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి వెళ్లాలంటే ఫోన్ చేసిన పది నిమిషాల్లోనే వాహనం ఇంటి ముందు వాలిపోతుంది. సదరు గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ వైద్యులు పరీక్షలు చేసిన తర్వాత మళ్లీ ఇంటి వద్దకు చేర్చుతుంది. దీంతో గర్భిణులు పథకాన్ని ప్రవేశపెట్టిన సీఎం కేసీఆర్‌ను ఎప్పటికీ మరువలేమంటున్నారు. జిల్లాలోని ఐదే నియోజకవర్గాల పరిధిలో 11 వాహనాలను ప్రభుత్వం కేటాయించింది. వివిధ గ్రామాల నుంచి 2018 నుంచి 2020 వరకు అమ్మ ఒడి కార్యక్రమం ద్వారా 84,883 ట్రిప్పుల ద్వారా 2,42,948 మందిని ఖమ్మం మాతా, శిశు సంరక్షణ కేంద్రాలకు తీసుకెళ్లి తిరిగి పరీక్షలు చేయించి వారివారి గ్రామాలకు పంపించారు. ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు 102 వాహనాల ద్వారా విస్తృతంగా సేవలందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు ప్రసవమైన తర్వాత తల్లీబిడ్డను క్షేమంగా కేసీఆర్ కిట్టు అందజేసి.. మందులను ఉచితంగా అందజేసి వారిని అమ్మ ఒడి 102 వాహనం ద్వారా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇళ్లకు పంపిస్తున్నారు.



102 వాహనం

### 2,43,000 మందికి సేవలు అందించాం



తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమ్మ ఒడి 102 సేవలను జిల్లాలోని 20 మండలాల్లో కల్పిస్తున్నాం. 2018 జనవరి నుంచి 2023 జూలై వరకు 2,43,000 మందిని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, మంచుకొండ, కామేపల్లి, ఏన్కూరు, వైరా, నేలకొండపల్లి ఆస్పత్రులకు తరలించాం. గర్భిణులకు పరీక్షలు చేసిన తర్వాత తిరిగి వారి స్వగృహాలకు పంపిస్తున్నాం. ప్రసవం తర్వాత తల్లీబిడ్డలతోపాటు కుటుంబ సభ్యులను కూడా వారి ఇళ్లకు ఎటువంటి ఖర్చు లేకుండా చేర్చుతున్నాం. ఈ పథకాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలి.

– భూమా నాగేందర్, 102 ప్రోగ్రాం మేనేజర్, ఖమ్మం

### రవాణా కష్టాలు తప్పాయి



నాకు పెళ్లయి ఏడాదిన్నర అవుతుంది. నేను గర్భిణిగా ఉన్నప్పటి నుంచి 102 వాహనం ద్వారానే వైద్య పరీక్షలకు వెళ్తున్నా. మా కుటుంబ సభ్యులు ఫోన్ చేయగానే పది నిమిషాల్లో మా ఇంటి దగ్గరకు వాహనం వస్తుంది. నాకు ఇప్పుడు తొమ్మిదో నెల. ప్రతి నెలా వైద్య పరీక్షల నిమిత్తం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి 102 వాహనం ద్వారానే వెళ్లాను. నా బిడ్డను 3 నెలలు మోసిన తల్లిని నేనైతే.. నన్ను, నా బిడ్డను తొమ్మిది నెలలుగా మోసిన తల్లి 102 వాహనం. పథకం ఏర్పాటు చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం.

– ఏడుకొండల వైష్ణవి, గర్భిణి, మర్లపాడు, మధిర మండలం

### ప్రభుత్వ సహకారం బాగుంది



మాది తెలంగాణ రాష్ట్ర సరిహద్దు గ్రామం కావడంతో ప్రతి చిన్న వైద్య అవసరానికి సొంత ఖర్చులతో పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లాల్సి వచ్చేది. కానీ.. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న వైద్య సౌకర్యాలతో పేదలు ధైర్యంగా జీవిస్తున్నారు. మొదట తనను బనిగండ్లపాడు పీహెచ్‌సీకి వైద్య పరీక్షల నిమిత్తం 102 వాహనంలో తీసుకెళ్లి పరీక్షలు చేశారు. ప్రసవ సమయానికి తనను ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి నార్మల్ డెలివరీ చేయించారు. ప్రస్తుతం నేను 9 నెలల గర్భవతిని. ఇప్పుడు కూడా 102 వాహనంలో తీసుకెళ్లి ప్రతి నెలా స్కానింగ్ చేస్తూ వైద్య పరీక్షలు చేయిస్తూ కంటికి రెప్పలా చూసుకుంటున్నారు.

– గరినెపూడి కవిత, గర్భిణి, రాజుపాలెం, ఎర్రుపాలెం మండలం

# ఉమ్మడి ఖమ్మంలో కారు జోరు

- ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు
- అభివృద్ధి, సంక్షేమమే ఆయుధాలుగా ప్రజల్లోకి..
- బీఆర్‌ఎస్‌లోకి కొనసాగుతున్న చేరికలు
- ఆయా నియోజకవర్గాలకు ఎన్నికల ఇన్‌చార్జిలు
- మంత్రి పువ్వాడ, ఎంపీలు నామా, వద్దిరాజుకు రెండేసి చొప్పున బాధ్యతలు
- 15న బీఫారంలు అందజేయనున్న కేసీఆర్





ఖమ్మం, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారరంగంలో దూసుకెళ్తున్నారు. అన్ని ప్రధాన రాజకీయ పార్టీల కన్నా ముందే ఎన్నికల ప్రచార పర్వాన్ని ప్రారంభించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే ఆయుధాలుగా ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్ వంటి ప్రధాన రాజకీయపార్టీ సైతం తమ అభ్యర్థులను తేల్చుకునేలోపే బీఆర్‌ఎస్ అభ్యర్థులు నిత్యం ప్రజల్లో ఉంటూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలు ప్రజలకు మరింత చేరువకావడానికి మరోసారి తమను గెలిపించాలని కోరుతున్నారు. మరోవైపు ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని 10 నియోజకవర్గాల్లో వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లోకి పెద్దసంఖ్యలో వలసలు పెరిగాయి. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకటించడానికి 50 రోజుల ముందే బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. దీంతో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ప్రభుత్వ విప్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, పినపాక అభ్యర్థి రేగా కాంతారావు, పార్టీ అభ్యర్థులు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోత్ మదన్‌లాల్, లింగాల కమల్‌రాజు, హరిప్రియానాయక్, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తెల్లం వెంకట్రావు ఆయా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై పట్టణాల్లోనూ, గ్రామాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైరా అభ్యర్థి బానోత్ మదన్‌లాల్‌కు మద్దతుగా ప్రస్తుత ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ నియోజకవర్గంలో విస్తృతంగా సభలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తానని బహిరంగంగా ప్రకటించిన రాములునాయక్‌పై ఇటీవల వైరాలో పర్యటించిన మంత్రి కేటీఆర్ సభావేదికపై ప్రశంసల వర్షం కురిపించారు. అభ్యర్థుల విజయానికి రాజకీయ వ్యూహ ప్రతి వ్యూహాలను రూపొందించడానికి మంత్రి పువ్వాడ, ఎంపీలు, ఎమ్మెల్సీలను ప్రతి నియోజకవర్గానికి ఒకరిని ఇన్‌చార్జిలుగా పార్టీ నియమించింది. ఖమ్మం, మధిర నియోజకవర్గాలకు మంత్రి పువ్వాడను ఇన్‌చార్జిగా నియమించగా ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాలకు రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, వైరా, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఖమ్మం ఎంపీ, పార్టీ లోక్‌సభాపక్ష నేత నామా నాగేశ్వరరావు, సత్తుపల్లి నియోజకవర్గానికి రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, భద్రాచలం నియోజకవర్గానికి ఖమ్మం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌ను నియమించింది. పినపాక నియోజకవర్గానికి పార్టీ అభ్యర్థి, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులకు ఆకర్షితులై తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీల నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నాయకులు, ముఖ్యనేతలు పెద్దఎత్తున పార్టీలో చేరారు. పది నియోజకవర్గాల్లో అభ్యర్థుల విజయానికి ఎన్నికల ఇన్‌చార్జులు పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి పువ్వాడ నేతృత్వంలో వివిధ పార్టీల నుంచి పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. ఆయా నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకలాపాలు మరింత వేగం పుంజుకున్నాయి. గత నెలలో మంత్రి కేటీఆర్, ఖమ్మం, సత్తుపల్లి, వైరా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రతిచోట వరాలజల్లు కురిపించడంతోపాటు కాంగ్రెస్, బీజేపీ వ్యవహారశైలిని తూర్పారపట్టడం, పార్టీ విజయం కోసం పార్టీశ్రేణులకు దిశానిర్దేశం చేయడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ పెరిగింది.

### 15న అభ్యర్థులతో కేసీఆర్ సమావేశం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 10మంది బీఆర్‌ఎస్ అభ్యర్థులతో పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో సమావేశంకానున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, ప్రచార సరళి విజయానికి అనుసరించాల్సిన వ్యూహ, ప్రతివ్యూహాలపై చర్చించి దిశానిర్దేశం చేయనున్నట్లు తెలుస్తోంది. అభ్యర్థులకు అదేరోజు పార్టీ బీఫారంలను అందజేయనున్నారు.